
రాఘవేంద్ర కాలనీ వినాయక ఆలయంలో భోజనం వడ్డిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి


కుషాయిగూడలో ఓటు అభ్యర్థిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ రజిత

అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా..

- గెలిచిన వారు ఉప్పల్ అభివృద్ధిని దశాబ్దాలుగా పట్టించుకోలేదు
- కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం
- కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో.. ప్రచారంలో దూసుకెళ్తున్న పరమేశ్వర్‌రెడ్డి
- కాంగ్రెస్ గెలుపు ఖాయమంటూ ధీమా


కుషాయిగూడలో ప్రచార ర్యాలీలో ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: చిలుకానగర్ రాఘవేంద్రా కాలనీలో వినాయక టెంపుల్‌లో ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, స్థానికులు, కాలనీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనాలను వడ్డిస్తూ కాలనీవాసులను ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. దశాబ్దాలుగా ఎన్నికైన నాయకులు ఉప్పల్‌ను పట్టించుకోవడం లేదని, ఈసారి ఒక్క అవకాశం కల్పించాలని, అభివృద్ధి అంటే ఎంటో చూపిస్తానంటూ తన ప్రచారంలో ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో నేతలు చెన్‌రెడ్డి రఘుపతి రెడ్డి, మోహన్‌రెడ్డి ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న కాంగ్రెస్ ప్రచారం

కుషాయిగూడ: ఉప్పల్‌లో కాంగ్రెస్ ప్రచారం ఊపందుకుంది. అభ్యర్థి మందుముల పరమేశ్వర్ రెడ్డి తనదైన శైలిలో కాంగ్రెస్ శ్రేణులను ఒక్కతాటిపై నడిపిస్తూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. శనివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ, నాగార్జుననగర్‌కాలనీ, సోనియాగాంధీనగర్ కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ చెయ్యి గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రచారం సాగిస్తున్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతే తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తుందన్నారు. ప్రజల్లో ఎక్కడికి వెళ్లినా స్వాగతిస్తూ మంగళహారతులు పాడుతూ ఆప్యాయతను చూపుతున్నారన్నారు. రానున్న రోజుల్లో పక్కా ప్రణాళికతో ప్రజల ముందుకెళ్లి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప్పల్ కార్పొరేటర్ మందుముల్ల రజితతో పాటు స్థానిక కాంగ్రెస్ నేతలు గడ్డం యాదగిరి, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం


జమ్మిగడ్డలో కాలనీవాసులతో మందముల పరమేశ్వర్‌రెడ్డి

కాప్రా: పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని కాంగ్రెస్ అభ్యర్థి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన జమ్మిగడ్డలో ప్రచారం నిర్వహించి అనంతరం సాయిబాబా దేవాలయంలో పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారంటీలను ఆయన వివరించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


మల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న నెమలి అనిల్‌కుమార్

స్థానికుల నుంచి విశేష స్పందన

మల్లాపూర్: మందముల పరమేశ్వర్‌రెడ్డి అందరికీ అందుబాటులో ఉంటాడు.. హస్తం గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ ఓటర్లను అభ్యర్థించారు. మల్లాపూర్ భవానీనగర్, లింగమయ్యనగర్, కేఎల్‌రెడ్డినగర్ కాలనీలో శనివారం ఇంటింటా ప్రచారం చేసి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. తమ ప్రచారానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆయన తెలిపారు. ఉప్పల్‌లో ఈసారి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో పీజీ సుదర్శన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో మూడు నామినేషన్లు

ఉప్పల్: ఉప్పల్ ఎన్నికల కార్యాలయంలో రెండవ రోజు ముగ్గురు అభ్యర్థులు తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నార్సింగ్, గండిపేట ప్రాంతానికి చెందిన కర్రి వెంకోజీరావు(66) స్వతంత్ర్య అభ్యర్థిగా తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి అభిషేక్ అగస్త్యాకు అందజేశారు. ఉప్పల్ మండలం మీర్‌పేట ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన ఉప్పల మంజుల(52) స్వతంత్ర్య అభ్యర్థిగా తన నామినేషన్‌ను దాఖలు చేశారు. రామంతాపూర్ వెంకటరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన అలమూరి తిమ్మయ్య చారి(40) పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి తన నామినేషన్ దాఖలు చేశారు.

మల్కాజిగిరి నుంచి 2 నామినేషన్లు


నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రసన్న నాయుడు

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గానికి రెండవ రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీకి చెందిన నాయకురాలు న్యాయవాది ప్రసన్ననాయుడు, తెలంగాణ ప్రజాజీవన రైతు పార్టీ తరపున చుండి శోభన్‌బాబు నామినేషన్ దాఖలు చేశారు. ప్రసన్ననాయుడు జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో నేరేడ్‌మెట్ డివిజన్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్


కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నేతలు

బోడుప్పల్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 8వ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విక్రం, 9వ డివిజన్ మహిళ అధ్యక్షురాలు సమతా యాదవ్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, వారు ప్రవేశపెట్టనున్న ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పోగుల నర్సింహరెడ్డి, పొన్నం తరుణ్‌గౌడ్, బొమ్మక్ రమేష్, కిషన్‌చారి, పొన్నం రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శనివారం ఉప్పల్ మినీ శిల్పారామంలో వాణి రమణ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. పలు అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు. సంస్కృతి, సాయి పవిత్ర, స్వాతి, అంజనాదేవి, సాహితి, త్రిష కళాకారులు దూరదర్శన్ బి- గ్రేడ్ ఆర్టిస్టులుగా ఎంపికై నట్లు నాట్య గురువు వాణి ప్రకటించారు. కూచిపూడి నాట్యగురువు డా.ప్రసన్నరాణి, దురదర్శన్ అధికారులు మధు రాయుడులు వీరిని ఆశీర్వదించారు.

ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించిన కన్సల్టెన్సీపై కేసు

ఉప్పల్: ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించి నిరుద్యోగిని మోసం చేసిన కన్సల్టెన్సీ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ ప్రగతినగర్‌లో ఉన్న డ్రీమ్ ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకుడు ఆదిత్య కనపర్తిని అదే ప్రాంతంలో నివసించే వదిత రాంబాబు కలిసి ఇతర దేశాలకు పంపాలని కోరాడు. అందుకు అతడి వద్ద ఎలాంటి డాక్యుమెంట్స్ లేవని చెప్పడంతో తానే డాక్యుమెంట్స్ తయారు చేసి పంపుతానని రూ.2 లక్షల వరకు రాంబాబు వద్ద లాగాడు. తీరా డాక్యుమెంట్స్ ఫేక్ అని తేలడంతో వీసా నిరాకరించారు. దీంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని రాంబాబు కోరడంతో రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నాడు. దీంతో బాధితుడు ఉప్పల్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్ వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాశ్ మీనా, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి వ్యయ పరిశీలకులు బాలా సాహెబ్ బాపూరావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులు, ఎఫ్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీవీటీ, ఎంసీసీ, టీమ్స్ ఎన్నికల విభాగం అధికారులతో ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ ఎంతో ముఖ్యమన్నారు. వ్యయ పరిశీలన బృందం అభ్యర్థుల వ్యయంపై షాడో రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. రోజువారి నిర్వహణపై రిజిస్టర్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యయ పరిశీలకులు బాలా సాహెబ్ బాపురావు, డీసీవో శ్రీనివాస మూర్తి, డీటీవో నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరంకుశ ప్రభుత్వ పాలన


మాట్లాడుతున్న ప్రొ. కోదండరామ్

అల్వాల్: రాష్ట్రంలో నిరంకుశ ప్రభుత్వ పాలన నడుస్తోందని, దాన్ని గద్దె దింపడానికి కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తామని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్ అన్నారు. శనివారం అల్వాల్‌లో టీజేఎస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన టీజేఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు అంతా కష్టపడి పనిచేయాలన్నారు.

ఎగ్జిబిషన్ అదుర్స్



హబ్సిగూడ: హబ్సిగూడలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో శనివారం ఎగ్జిబిషన్‌ని డాక్టర్ గాడ్విన్ డానియల్ హాజరై ప్రారంభించారు. నమూనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు థెరిస్సా, ఉపాధ్యాయులు సబేరా, శ్రీలత, శైలజ, సుమలత పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి


గౌతంనగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్/గౌతంనగర్: మల్కాజిగిరిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్, జేఎల్‌ఎస్‌ఎస్‌నగర్, న్యూవెంకటేశ్వరనగర్, గోపాల్‌నగర్, జ్యోతినగర్, న్యూమిర్జాల్‌గూడ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ఆయన ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అల్వాల్‌లో..

రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అల్వాల్‌లోని పలు ప్రాంతాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించండి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు


మచ్చబొల్లారంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని ప్రెసిడెన్సీ కాలనీ, ఎవెన్యూ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ జితేంద్రనాథ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. చెయ్యి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలు చేరువయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

జోరుగా ప్రచారం...

మల్కాజిగిరి: మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వారికి మద్దతుగా కార్పొరేటర్లు, నాయకులు కాలనీల్లో ఇంటింటికీ తిరిగి ఓటర్లను ఓటు అభ్యర్థిస్తున్నారు.

లవ్ బ్రేకప్ చెప్పడంతో ప్రియురాలిపై కత్తితో దాడి

తాను కూడా పొడుచుకొని ఆత్మహత్యాయత్నం

కుషాయిగూడ: లవ్ బ్రేకప్ చెప్పడంతో ఓ ప్రియుడు ప్రియురాలిపై కత్తితో దాడికి పాల్పడి తాను కూడా కత్తితో పొడుచుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీఏఈ కాలనీకి చెందిన మెరుగు వన్ష్ (21) మౌలాలి ఎంజే కాలనీలో నివసించే యువతి (21) ఇద్దరు చిన్ననాటి మిత్రులు. ఒకే స్కూల్‌లో చదువుకున్న వారు చిన్ననాటి నుంచే స్నేహంగా ఉంటూ వస్తున్నారు. వారి స్నేహం కాస్తా ప్రేమగా మారి ప్రేమికులయ్యారు. ప్రస్తుతం వారు కీసరలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ శుక్రవారం అమ్మాయి లవ్ బ్రేకప్ చెప్పింది. దీంతో మనసులో కక్ష పెట్టుకున్న వన్ష్ ప్రియురాలిని చంపి తాను కూడా చనిపోవాలని పథకం వేసుకున్నాడు. శనివారం తన ప్రియురాలికి ఫోన్ చేసి చివరిసారిగా ఒక్కసారి మాట్లాడుకుందా అంటూ నమ్మించి పిలిపించాడు. అలా ఇద్దరు కలిసి కారులో డీఏఈ కాలనీకి వెళ్లారు. కాలనీలో ఓ మూలన కారు పార్కు చేసి కారు అద్దాలు వేసుకొని మాట్లాడుకున్నారు. ఎందుకు బ్రేకప్ చెబుతున్నావంటూ కొద్దిసేపు వాదించుకున్నారు. ఈ క్రమంలోనే ఒక్కసారిగా కత్తి తీసి ప్రియురాలి, పొట్ట, మెడపై విచక్షణ రహితంగా పొడవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో వన్ష్ కూడా పొట్టలో పొడుచుకొని ఆత్మహత్యయత్నం చేశాడు. ఆమె కేకలు వేయడంతో గమనించిన కాలనీవాసులు, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది కారు వద్దకు వెళ్లి కారు అద్దాలు పగులగొట్టి కారు డోర్ తెరిచారు. వారిని స్థానిక ఎన్‌ఎఫ్‌సీ సంజీవని ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. ఘటనపై వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఇద్దరి ప్రాణాలకు హాని లేదన్నారు.

అక్షరలో ఆకట్టుకున్న గ్రామోత్సవ్



కుషాయిగూడ: కుషాయిగూడలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన అక్షర గ్రామోత్సవ్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామీణ వేషధారణలో పాఠశాలకు హాజరై సందడి చేశారు. గ్రామీణ ప్రజల జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన కలిగేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వారి జీవన విధానంపై వివరించారు. అలాగే నృత్య ప్రదర్శనలతో గ్రామీణుల జీవనాన్ని కళ్లకు కట్టేలా చూపించారు. ప్రిన్సిపల్ రితిక మాట్లాడుతూ నేటి తరం పిల్లలకు గ్రామీణ నేపథ్యంపై కనీస అవగాహన లేకుండా పోయిందన్నారు. ఈ క్రమంలోనే పాఠశాలలో గ్రామోత్సవ్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించామన్నారు.

భాష్యం బ్లూమ్స్‌లో వైజ్ఞానిక ప్రదర్శన



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భాష్యం బ్లూమ్స్‌లో శనివారం సెప్‌సా ఎక్స్‌పో వాగాన్జా ప్రోగాంలో భాగంగా విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ రకాల వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించి కుటుంబ సభ్యులు, పాఠశాల యాజమాన్యానికి నమూనాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భాష్యం బ్లూమ్స్ సీఈవో చైతన్య హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమానికి జోన్-2 డీన్ అర్చన, పాఠశాల ప్రధానోపాధాయులు సలోమి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

మేడిపల్లి: మేడిపల్లి బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ స్కూల్లో శనివారం ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు పాఠశాలకు విచ్చేసి యాజమాన్యం నిర్వహించిన వివిధ రకాల ఆట, పాటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోత్స్నదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొని వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.


బచ్‌పన్ అకాడమిక్ హైట్స్‌లో..

నేడు బీఆర్‌ఎస్‌లోకి మాజీ కార్పొరేటర్ రాఘవన్

గౌతంనగర్: మల్కాజిగిరి మాజీ కౌన్సిలర్, అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ గౌతంనగర్‌కు చెందిన వెంకటరమణ(రాఘవన్) ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు. ఉదయం ఆనంద్‌బాగ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం సుమారు 3 వేల మందితో ఉత్తంనగర్, దయానంద్‌నగర్, గౌతంనగర్, మల్లికార్జుననగర్, హనుమాన్‌పేట్ మీదిగా జ్యోతిగనర్‌కు భారీ ర్యాలీగా వెళ్లి బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నేతలు, మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

చర్లపల్లి జైలులో జైల్ అదాలత్

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో శనివారం జైల్ అదాలత్ నిర్వహించారు. మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల కోర్టులకు చెందిన 9 మంది న్యాయమూర్తులు పాల్గొని 33 మందికి సంబంధించి 73 కేసులకు పరిష్కారం చూపారు. న్యాయసాయం పొందలేని పేద ఖైదీలకు ఈ జైల్ అదాలత్ ఎంతగానో దోహదపడుతుందని జైల్ పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్ అన్నారు. కార్యక్రమంలో జైల్ ఉప పర్యవేక్షణాధికారి కృష్ణమూర్తి, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఆక్వేరియం

బోడుప్పల్: ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన జీవన్ సాగర్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటోందని నిర్వాహకులు నారాయణ వెల్లడించారు. పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలాంబో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్, జువెలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, స్టాయిల్స్ స్టాల్స్, డ్రైఫ్రూట్ స్టాల్స్, ఆల్ వెరైటీ ఫుడ్స్ స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అంతేగాకుండా అండర్ వాటర్ ట్యూనల్ ఆక్వేరియ్ మొదటిసారిగా పెట్టడం జరిగిందన్నారు. నీటి అడుగున సొరంగ ప్రదర్శన, రెండు వేల చేపలతో ప్రత్యేక ఆకర్షణీయంగా ఉందన్నారు. సాయంత్రం 3 నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహించే ఎగ్జిబిషన్‌ను నగర శివారు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.